# అలౌకికం

కమలాకరం హడావిడిగా వచ్చాడు.

"మనం ఎక్కవలసిన రైలు బండి రద్దయిపోయింది "అన్నాడు.

"మరెలా ?"

"ఏదో స్టేషన్‌లో అల్లర్లు- అశాంతి... కొచ్చిన్ ఎక్స్‌ప్రెస్‌లో రెండు బెర్తులు దొరికాయి.... ఇక ఆదివారం రాత్రే......"

ఆఫీసు పని అయిపోయినా అదనంగా కలకత్తాలో అదివారం రోజంతా గడపాల్సి వచ్చింది. సరే మ్యూజియమ్ చూద్దాం అనుకున్నాం మేమిద్దరం. ఉదయాన్నే వెళ్లి ద్వారం ముందు వాలిపోయాం. నిర్ణీత సమయానికి ముందుగా, మాకోసం తెరిచిపెట్టరుగా. గంటన్నర వ్యవధి ఉందన్నాడు అక్కడ చౌకీదారు.

ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏదో సందడి. మైకులో సినీ సంగీతం. మధ్య మధ్య వాణిజ్య ప్రకటనలు. చుట్టూతా రంగురంగుల కాన్వాస్ గుడ్డలతో దడి కట్టి ముఖ ద్వారం దగ్గర కలకత్తా కెన్నల్ క్లబ్ నిర్వహిస్తున్న కుక్కల ప్రదర్శన అని బానర్ అలంకరించారు.

" పదండి ఒక గంట ఇక్కడే సులభంగా గడపచ్చు." అన్నాడు కమలాకరం. కుక్కలంటే నాకు ఏవగింపు ఈనాటిదికాదు. వెనుకటి గుణమేల మానువినరా సుమతి ! అంటూ పద్యాన్ని సాగదీసి ఆ గుణాన్ని మా తెలుగు టీచరు విడమరచి చెప్పడం ఒక కారణం కావచ్చు. ఇకరెండోది. చిన్నతనంలో ఇంటికి స్కూలు నించి రాగానే యమధర్మరాజులాగ ప్రైవేటు మాష్టారు మా అరుగు మీద నా కోసం కూర్చునే వాడు. ఇంకో నలుగురు కుర్రాళ్ళతో కలిపి లెక్కలు చెప్పేవాడు. ఆ రోజుల్లో లెక్కలంటే భయం. భయంతో అసలు వచ్చేవి కావు. మాస్టారికి సహనం లేనే లేదు. ఒక లెక్క ఇచ్చి మా అందరినీ పలక మీద చేసి చూపమనేవాడు. నాకు తెలియదు అంటే " ప్రయత్నించవోయ్ .." అని ఒక మొట్టు మొట్టేవాడు. లెక్క తప్పు చేసినందుకు మరో మొట్టికాయ వేసేవాడు. రెండు మొట్లను కుదించి ఒకటే మొట్టికాయను ఎంత ఆలస్యంగా అప్పావిస్తే అంత

మంచిదని – ఏదో ఆలోచిస్తున్నట్టూ ఏదో ప్రయత్నం చేస్తున్నట్లూ నా చేతి వేళ్ళు లెక్కపెడుతూ మా ఇంటి దగ్గర ఉన్న మైదానం వేపు చూసేవాణ్ణి. మా ఎదురింట్లో అద్దెకు ఉంటున్న వాళ్ల గోపిగాడు గాలిలో హాయిగా స్వైర విహారం చేస్తూ వుండేవాడు. వాడి వెనకనే ఒక కుక్కపిల్ల. దాని మెడలో ఒక నవారు పీలిక కట్టి, దానికి వేరే ఇంకో తాడు కట్టి, కుక్కపిల్లను తన వెంటే తిప్పుకుంటూ, ఏవేవో దానితో మాటాలడుకుంటూ సర్కస్‌లో రింగు మాష్టరులాగ బోర విరుచుకుని తిరిగేవాడు. ఆ రెండు జీవులూ హాయిగా అనుభవిస్తున్న స్వేచ్ఛను నేను పోగొట్టుకుంటున్నాననే ఉక్రోషంతో ఈర్ష్యగా ఉండేవాణ్ణి. గోపి నాకన్నా బలవంతుడాయె. వాడ్నేమీ అనలేక ఎప్పుడైనా ఆ కుక్కపిల్ల వాడికి దూరంగా మా ఇంటి ముందు కనిపిస్తే ఒక రాయి బెడ్డ వేసేవాణ్ణి. అది కుయ్యోమంటే కొంత ఉపశమనం పొందేవాణ్ణి. ఆ తర్వాత పెరిగి పెద్దవాళ్లమై హైస్కూల్లో పై క్లాసులు చదివే రోజుల్లో నేనూ గోపీ ఫుట్‌బాల్ టీమ్‌లో సభ్యులమై స్నేహితులుగా మారిపోయాం. చిన్నతనపు కొంటె చేష్టలు తలుచుకు తలుచుకు నవ్వుకునే వాళ్లం. అదంతా వేరే సంగతి.

"ఇవిగో టిక్కెట్లు. పోదాం పదండి లోపలికి" అంటూ కమలాకరం నన్ను గతంలోంచి వర్తమానంలోకి ఈడ్చి ప్రదర్శనశాలలోకి లాక్కుపోయాడు. మొదటి వలయంలో ఎక్కడ చూసినా చిన్నచిన్న దుకాణాలు, అందులో కుక్కలకు బిస్కట్టులు, మందులు, పోషకాహారాలు, ఇనుప గొలుసులు, మెడకి తోలు పటకాలు, కుక్కల పెంపకానికి చిట్కాలున్న పుస్తకాలు కనిపిస్తున్నాయి. పొరపాటున ఆగి అటు తొంగి చూస్తే చాలు లోనికి పిల్చి రెపరెప లాడే రంగు కాగితాలు మా చేతిలో కుక్కి ప్రత్యేక తగ్గింపు ధరలంటున్నారు. ఈ గొడవ ఎందుకని రెండవ వలయంలోకి వెళ్లాం. ఎక్కడ చూసినా చిన్న చిన్న గుంపులుగా మనుష్యులు. వాళ్ళ మధ్యన ప్రదర్శనకని తెచ్చి పోటీకి నెంబర్లు రాయించుకున్న కుక్కలు, ఆ కుక్కల్ని సముదాయించి చేతులతో బుజ్జగిస్తున్న కుక్కల యజమాన్లు. కొత్తగా స్కూల్లో చేరబోతున్న చిన్నపిల్లల్లాగ ఆ కుక్కల కళ్లలో ఏదో ఆందోళన. మా కమలాకరానికి కుక్కల గురించి కొంత తెలిసినట్టే ఉంది. అవిగో జర్మన్ షెపర్డ్స్, ఆఫ్ఘన్ హౌండ్స్ అంటూ ఏకరువు పెడుతున్నాడు.

ఒకచోట మంత్రించినట్టు ఆగిపోయి "చూశారా ? అది సలూకీ….. "అన్నాడు. ఆ కుక్కనూ దానిని తెచ్చిన బెంగాలీ వనితనూ చూశాను. ఆమె ఎంతో నాజూకుగా ఉంది. ఆమె కప్పుకున్న కాశ్మీర్ శాలువను ఆ కుక్కకు కూడా కప్పి ఒకచేతిని దాని వీపు మీద పెట్టి దగ్గరగా హత్తుకుంది. కేవలం వీధుల్లో కనిపించిన కుక్కలనే చూసిన నాకు ఇన్ని రంగులూ ఇన్ని రకాల కుక్కలను చూశాక నేను ఎన్నడూ ఎరగని ఇంత కుక్కల ప్రపంచం ఉందా – అనిపించేసింది.

రెండు వలయాల తర్వాత మిగిలిన చదునైన జాగాలో నీళ్ళు జల్లి ఆరబెట్టి నలుచదరంగా దాని చుట్టూ గేలరీ వేశారు. కోర్టులో ముద్దాయిలను పేర్లు పెట్టి గట్టిగా పిల్చినట్టు మైకులో కుక్కల జాతిని చెప్పి నెంబరును పిలవగానే క్షణమైనా ఆలస్యం లేకుండా ఆ కుక్కను తెచ్చిదాని యజమాని అక్కడ హాజర్ హుజూర్! అన్నట్టుగా నిలబెడుతున్నాడు. ఒక పెద్ద మనిషి దాని పళ్ళూ కళ్ళూ చూసి, తోకను ఎత్తి, దించి కుక్కను నడిపించి పరుగెత్తించి ఏవేవో చెబుతూ వుంటే తెల్లని కోటు వేసుకున్న ఒక అమ్మడు ఏదో నోట్సు రాస్తోంది.

నల్లని ఎలుగుబంటి పిల్లల్లా రెండు కుక్కలు వింతగా కనిపిస్తే అటు చూస్తున్నాను. వాటికి తోకలు ఉండి లేనట్టే చిన్నవిగా ఉన్నాయి. ఆశ్చర్యంతో చూస్తూ నా ముందు వరుసలో నా దృష్టికి అడ్డు వస్తున్న పెద్ద తలకాయ ఆసామిని కాస్త తప్పుకుంటారా ? అలవాటుగా, తెలుగులోనే అడిగాను. ఆ పెద్దమనిషి నా వేపు చూస్తూ, " ఒరే అప్పా! నువ్వే?" అన్నాడు. మా స్నేహం ముదిరాక నన్ను అప్పారావ్ అని పిలవకుండా అప్పా అనేవాడు ఆప్యాయంగా. ఆ పలకరింపు మాగోపీనాథ్ ఉంఫ్ చిన్నతనంలో ఇంటికెదురుగా ఉండిన గోపిగాడిదే. " ఎక్కడ ఉంటున్నావ్ ?" అని అడిగాను. " ఆర్మీలో డాక్టర్‌గా సిల్‌చర్‌లో ఉంటున్నాను. పనిమీద కలకత్తా వచ్చి ఈ సాయంత్రమే వెనక్కు వెళ్ళిపోతున్నాను. ఇక్కడ డాగ్‌షో అన్న ఆహ్వానం చూడగానే కాళ్ళు ఇటులాగాయి" అన్నాడు గోపి.

నిజంగా నీకు వెయ్యేళ్ళు. చెబితే నమ్ముతావో లేదో కానీ ఇప్పుడే నిన్ను తలుచుకున్నాను అంటూ కమలాకరాన్ని పరిచయం చేశాను. మెకాన్స్ కన్సల్టెంసీలో ఇద్దరమూ పనిచేస్తూ మా ఆఫీసు పని మీద కలకత్తా వచ్చినట్లు చెప్పాను. టైము చూస్తే పదకొండున్నర కావస్తోంది. గోపిని ప్రదర్శన శాలలోనే విడిచిపెట్టి మేమిద్దరం బయటపడ్డాం.

అలా అనుకోకుండా కలిసి మేం విడిపోయిన కొన్నాళ్ళకు ఒకమారు విజయవాడ రైల్వే ప్లాట్‌ఫామ్ మీద గోపి చెల్లెలు కనిపించింది. నన్నూ, నా భార్యనూ, పిల్లల్నీ చూసి ముచ్చటపడింది.

" నువ్వు ఒక ఇంటి వాడవై పోయావు. నీ స్నేహితుణ్ణేం అలా ఉంచేశావ్ ? ఇప్పటికి పెళ్ళిమాట ఎత్తడు, ఎత్తనివ్వడు " అని బాధపడింది. కానీ తర్వాత గోపి వార్తలు మళ్ళా ఏమీ తెలియనే లేదు.

ఇలాంటి దేశ ప్రదక్షిణంలో భాగంగానే మొన్న అహ్మదాబాద్ వెళ్ళవలసి వచ్చింది. ఆశ్రమ్ రోడ్డుమీద పోతూ వుంటే కాళ్ళు నన్ను సబర్మతి ఆశ్రమంలోకి లాక్కుపోయాయి. బెనెకింగ్స్లీ

నటించిన చిత్రంలో చూసిన ఆశ్రమం కళ్ళ ఎదుటే ఉన్నప్పుడు ఒకసారి చూసి పోదామని లోనికివెళ్ళాను. అంతా తిరిగి, కస్తూర్‌బా, మహాత్మగాంధీలు నివసించిన నిరాడంబరమైన ఇంటి అరుగు మీద రెండు నిముషాలు విశ్రమించాను. నాకు కాసింత దూరాన ఇద్దరు వృద్ధులు తీరిగ్గా కూర్చుని హిందీలో రాజస్థానీ యాసతో గట్టిగానే చర్చించుకుంటున్నారు. ఏదో కారణంగా ఈ శతాబ్ధంలో జరిగిన, జరుగుతున్న హింస, నరమేధ చుట్టూ ఆ చర్చ తిరుగుతోంది. హింసించగల శక్తి ఉండి కూడా దానికి కళ్లెం వెయ్యగలగడమే అహింస సిద్ధాంతమనీ,మనసులో ప్రేమ పండించగలవాడే ఆ యోగాన్నీ సాధించగలడనీ వివరిస్తున్నాడొక వృద్ధుడు. నా చేతి గడియారాన్ని చూసుకుని, ఆశ్రమంలోంచి బయట పడ్డాను.

రోడ్డుమీద నడుస్తూ వుంటే ఆకుపచ్చని ఆర్మీ దుస్తుల్లో హడావిడిగా ఎవరితోనో మాట్లాడుతూ కనపడ్డాడు గోపినాథ్." ఇక్కడకెలా వచ్చావ్?" అన్నాను. ఆర్మీ సర్వీస్‌లో ఉన్నాక దేశంలో ఎక్కడికి పొమ్మన్నా పోవలసిందే కదా. నేను పనిమీద వడోదరా వెళ్తున్నాను. రాత్రికల్లా ఇక్కడకు, వచ్చేస్తాను. రేపు ఉదయాన్నేమా క్వార్టర్‌కి వచ్చేయాలి. నేనూ ఒక రోజు శలవు తీసుకుంటాను." అన్నాడు. నా జేబులోని కలాన్ని తీసి తన క్వార్టర్స్ నెంబర్ వివరాలు రాసి ఇచ్చి జీపులో వెళ్ళిపోయాడు.

మూడురోజులుగా రద్దీగా ఉన్న రోడ్లమీద తిరుగుతూ కలుషితమైన గాలీ ధూళీ పీలుస్తున్న నాకు షాహీబాగ్ దాటి సైనికాధికారుల నివాసాలవేపు నడుస్తూ వుంటే నిర్మలమైన గాలీ, పుష్కలంగా పచ్చని చెట్ల నీడా దొరికింది. నెమళ్ళు పచ్చని చెట్ల కింద పురులు విప్పి ఆడుతున్నాయి. మధ్యలో సైనికుడి దుస్తుల్లో ఉన్న జవాన్‌అడ్డుపడి ఎక్కడికని ప్రశ్నించాడు. నా కాగితం మీద ఉన్న క్వార్టర్స్ నెంబరూ గోపినాథ్ పేరూ చెప్పగానే వినయవిధేయతల్తో నేనెలా వెళ్లాలో వివరించి పుణ్యం కట్టుకున్నాడు.

వాకిట నిలబడ్డానో లేదో ఉరుము ఉరిమినట్టు భౌభౌ; అంటూ సింహంలా నా ముందుకొచ్చి హడలు గొట్టేసింది నల్లని కుక్క. అడుగు ముందుకు వెయ్యకుండా అచేతనంగా నిలిచిపోయాను. గుండె ఆగినట్టయింది. ఒక్కక్షణం " గుడ్‌బోయ్ ...కం...స్కాట్ కమప్...." అన్న గంభీరమైన కంఠం మంద్రస్థాయిలో బాల్కనీ మించి వినిపించింది. ఆ కంఠం గోపీదే. మునసబులా వెళ్ళి దఫేదారులా తిరిగొచ్చిన సామెతగా ఆ కుక్క పిల్లిలా మారిపోయి మెట్లెక్కి పోయింది. అయినా నా కాలు ముందుకు పడడానికి మొరాయిస్తూ వుంటే గోపీ వేగంగా కిందకు వచ్చి భుజం మీద చెయ్యేసి ఆప్యాయంగా తీసుకుని వెళ్ళాడు.

" ఇదేం న్యాయంరా గోపీ! సింహంలాంటి కుక్కను గొలుసుతో కట్టకుండా విడిచిపెట్టావు. నాలాంటి వాళ్ళ ప్రాణాలు ఏం కావాలి" అని తడారిన గొంతుతో అన్నాను.

"ఈ నాలుగిళ్ళ వాళ్ళకీ మా కుక్కపరిచయమైపోయింది. దాని కట్టుబాటు శిక్షణ మీద వాళ్ళకి బరోసా ఉంది. నా ఆజ్ఞ లేకుండా అది ఈ ప్రహరీ గోడదాటి రోడ్డుమీదకు పోదు...."

" అయితే మాత్రం దీని తత్త్వం తెలియని నాలాంటి వాళ్ళు వస్తే హడలి చావరూ ?" అన్నాను నిష్ఠూరంగా .

" పొరబాటైందిరా అప్పా! సారీ ... అది వెల్‌ట్రెయిన్డ్ డాగ్ ..... కొత్తవాళ్ళను అడుగుముందుకు వెయ్యకుండా నిలబెట్టి అరుస్తుంది. కానీ హానీ ఏ మాత్రం చెయ్యదు. మా గొంతు కోసం ఎదురు చూస్తుంది." అంటూ కబుర్లు చెబుతున్నాడు.

రాక రాక వచ్చిన స్నేహితుణ్ణి నిలబెట్టి కథలు చెప్పడమేనా లేక బ్రేక్‌ఫాస్ట్ చేయించడం ఏమన్నా ఉందా ?" అంటూ ఎదురొచ్చిన శాస్త్రీని చూసి ఆశ్చర్యపోవడం నావంతైంది.

"వదినెగార్ని తీసుకురాలేదేం ?" అని అడిగింది

"నీకు ఆశ్చర్యాన్ని కలిగించాలనే చెప్పలేదు." అని నీళ్ళు నములుతున్న గోపి మాటల్లోంచి తేరుకుని ఈ ఇంట్లో ఒక చెల్లెలు స్వాగతం చెప్పడానికి ఉందని ఇప్పుడే కదా నాకు తెల్సింది. మావాడు శుభ లేఖయినా పంపందే. పోనీలే. మొన్న మొన్నటి దాకా ఉత్తి సన్నాసిరాజు ఈనాటికి కుటుంబరావ్ అయ్యాడు. అన్నాను.

మేం కూర్చుని ముచ్చటలాడుకుంటూ వుంటే గోపి పాదాలను ఆనుకుని ప్రశాంతంగా నా వేపు చూస్తూ పడుకుంది ఆ కుక్క .ఆ ఉగ్రనరసింహాకృతి ఎక్కడికి పోయిందే ఏమో చాలాప్రశాంతంగా ఉంది.

దీని పేరు ఏమిటన్నావ్? అని గోపినడిగాను.

"ఇది కాదు . వీడు, వీడి పేరు స్కాట్" అన్నాడు. నిక్కి ఉన్న చెవులు, మెడా వెన్నూ తోకా అంతా నల్లని దుప్పటితో కప్పినట్టుంది. కాళ్ళు మాత్రం తెలుపు ఎరుపూ కలిసిన రంగు .ఎర్రటి నాలుకను కాగితంలా రెపరెపలాడిస్తూ నావేపు చూస్తోంది.

చిన్నతనం నుంచీ మా గోపీకి కుక్కలంటే ఉన్న అనుబంధానికి నవ్వు వచ్చింది. ఆపుకోబోతూ వుంటే ఎందుకో నవ్వుతున్నారని ప్రశ్నించింది వాడి భార్య హేమలత. నా మనసులో

మెదిలిన విషయాలన్నీ వివరించాను. నా మాటలు వింటూనే గోపీ హేమలతలు యుగళగీతం ఆలపించినట్టు గలగలా నవ్వారు.

" అయితే ఈ పిచ్చి చిన్నతనం నుంచి ఉందన్నమాట. ఆ కుక్క మీదున్న అభిమానంతో భార్యను సరిగ్గా చూసుకుంటాడో లేదో అన్న భయంతోనే ఎవ్వరూ పెళ్ళి చేసుకునేందుకు చొరవ తీసుకుని ఉండరు. మా నాయనమ్మ నా మెడలు వంచి ఈయనతో ముడివేసేసింది "అని హేమలత చమత్కరించింది.

మరి ఇప్పుడు వాడి అభిమానాన్ని సరిగ్గా అయినా పంచుతున్నాడా ? అని అడిగాను.

" త్రాసు కొంచెం కుక్కవేపే మొగ్గు చూపుతుంది." అని నవ్వింది.

ఇంతలో ' ఆంటీ! ' అంటూ తలుపు తోసుకుని లోనికొచ్చాడు ఆరేళ్ళ పిల్లవాడు. స్కాట్ హడావిడిగా ఉరికి వాడి మీదకు వెళ్ళింది. నేను కంగారు పడుతూ వుంటే ఆ కుక్క కుర్రవాణ్ణి వాసన చూస్తూ తోక ఊపుతూ పలుకరించింది. భౌభౌ అన్న అరుపులు లేకపోగా ప్రేమను వొలికిస్తూ విచిత్రమైన చిన్న శబ్దాలు పలికిస్తోంది దాని కంఠంలోంచి.

ఎవడీ పిల్లవాడు -నేనడిగాను.

" మా క్రింద క్వార్టర్స్‌లో ఉన్న కర్నల్ వినోద్‌గారి మనవడు. కుక్కతో ఆడుకుందుకే ప్రత్యేకంగా వస్తాడు. మా స్కాట్‌గాడికి ఆ పిల్లడంటే తెగ ఇష్టం." అని హేమలత పూర్తి చేసేలోగా ఆ కుక్కా కుర్రాడూ ఒకళ్ళ వెనకాల ఇంకొకళ్ళు పరుగెత్తడం హోరాహోరిగా దెబ్బలాడుకోవడం జరుగుతోంది. విస్తుపోయాను.

దాని పళ్లూ కోరలూ వాడికి గుచ్చుకోవు కదా - అన్నాను.

" అదంతా ఉత్తుత్తి యుద్ధం. నిజానికి తలవెంట్రుకవాసి హాని కలగనివ్వదు అంది హేమ.

కొంత సేపటికి ఆ పిల్లడు బంతి ఎక్కడో దాచి వస్తున్నాడు. అది పోయి పసిగట్టి బంతిని వెతికి నోటితో పట్టుకొచ్చి విజయగర్వంతో ఆ పసివాడి వేపు చూస్తోంది. ఆ పిల్లవాడు దాని మీద పడుతూ లేస్తూ ఎంత ఇబ్బంది పెట్టినా అదంతా దానికెంతో ఆనందంగా ఉన్నట్టే భరించి ఆడుతోంది. నేనటే చూస్తున్నాను. హేమలత టేబుల్ మీద వేడివేడిగా బ్రేక్‌ఫాస్ట్ సిద్ధం చేసి మా ఇరువుర్నీ రమ్మని తొందరచేసింది.

వీధి తలుపు తీసి ఉన్నా ఎవడో బెల్ మ్రోగించాడు. కుక్క ఒకమారు పరుగున వెళ్లి

చూసి వచ్చేసింది. ఒక యువకుడు- రామ్‌రామ్ అంటూ వినయంగా వచ్చి ఇంట్లో చెదురు మదురుగా ఉన్న వస్తువులు దులిపి, యథాస్థానంలో ఉంచి, తన విధి నిర్వహించుకు పోతున్నాడు.

" నన్ను చూసి కొంపలు మునిగిపోయినంత హడావిడి చేసిన మీ కుక్క వాడెవడో వస్తే అరవనైనా అరవలేదే " అన్నాను గోపితో.

"డ్యూటీలో రోజూ వచ్చిపోయే వాళ్లు దానికి తెలుసు. కొత్తవాడెవడైనా డ్యూటీకి వస్తే ఇవాళ నీ ముందు చేసిన హంగామా అంతా ఆ మొదటి రోజున చేస్తుంది" అన్నాడు.

మేం బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నంత సేపూ పిల్లవాడితో ఏదో ఆడుతున్నదే కానీ మా ప్రాంతానికి దగ్గరనైనా రాలేదు ఆ కుక్క. " స్కాట్‌కి బ్రేక్‌ఫాస్టు లేదా ?" అన్నాను. " దాని ఆహారం వేరు. తినే జాగా వేరు. వేళకు మేం పెట్టడం మరిచిపోతే అడిగి మరీ పెట్టించుకుని తింటుంది." అని హేమలత నవ్వింది.

ఎక్కడ దొరికిందీ కుక్క? మనం కలకత్తాలో కలిసినప్పుడు ఈ కుక్క ప్రస్తావన రాలేదే .,.. అన్నాను - గోపి వేపు తిరిగి.

"అప్పటికి లేదు. సిల్చర్ నుంచి నాగాలాండ్ వెళ్ళిన సమయంలో ఎవరో రెండు నెలలు వయసు పిల్లని నాకు ఇచ్చాడు. ఒంటరిగా నాగాలాండ్‌లో నేను గడిపిన రోజుల్లో తీరికున్నప్పుడు వీడితోనే గడపడం, పుస్తకాలు చదివి శిక్షణ ఇవ్వడం చేశాను. నేనెంత శ్రద్ధగా చూశానో నాకంత రక్షణ కవచంలా ఉండి కాపాడాడు. ఇక్కడికొచ్చాక నాకు పని ఎక్కువగా ఉంటోంది. అందుకే వీడ్ని బాగా చూడలేకపోతున్నాను. నాకు తీరిక లేని రోజున సాయంత్రం మా బయ్యా (సహాయక్) వీడి మెడకి గొలుసుకట్టి అలా తిప్పి తీసుకుని వస్తూ వుంటాడు. నాతో వచ్చినప్పుడు దానికి గొలుసు కట్టవలసిన పని ఉండదు." వాడూ వాడూ అని ఒక వ్యక్తిత్వాన్ని ఆపాదించి మాట్లాడుతూ వుంటే నాకు నవ్వు వచ్చింది. ఇంతలో టెలిఫోన్ మోగింది. " ఇప్పుడేవస్తా "నంటూ గోపీ హడావిడిగా ఎక్కడికో బయలుదేరక తప్పలేదు. వాడి వెంట కుక్క వెళ్ళబోతూ వుంటే " నో యూ ఆర్ నాట్ కమింగ్ "అన్నాడు నిష్కర్షగా చిన్నపిల్లల్లాగ చిన్నబుచ్చుకుని వెనక్కు వచ్చేసిన ఆకుక్క నా వేపు మొహం ఉంచి నాకు కొంత దూరంలో పడుకుంది.

చేసేది లేక, తేలికగా రికార్డ్ ప్లేయర్‌లోంచి వస్తున్న సంగీతం వింటూ, పత్రికలు తిరగేస్తూ అప్పుడప్పుడు హేమలత ప్రశ్నలకు జవాబులిస్తూ కూర్చున్నాను. సుమారు నలభై

నిముషాలు గడిచాయి. ఇంతలో, ప్రశాంతంగా ఉన్న ఆ కుక్కలో ఏదో చైతన్యం ఏదో, సంచలనం. లేచి నాలుగు కాళ్ళమీదా నిల్చుని చెవులు రిక్కించింది. మరో అరనిముషంలో గోపీ వస్తున్నట్టు బూట్లు చప్పుడు మెట్లమీద టకటక వినిపించింది. ఆశ్చర్యం వేసింది. ఎలాగోపీ రాక దానికి తెలిసింది? నా చెవులకు అడుగుల సవ్వడి తాకక ముందే దానికి సంకేతం అందిపోయి ఉండాలి. తోక తెగ ఆడిస్తోంది.

భోజనాల అనంతరం ఏవేవో ముచ్చటలతో గడిపి, కాస్త విశ్రాంతి తీసుకున్నాక ఆ సాయంత్రం ముగ్గురం చల్లగాలిలో తిరిగి వద్దామని నిశ్చయించుకున్నాం. కానీ హేమలత కోసం ఎవరో స్నేహితురాలు వస్తున్నట్టు ఫోన్‌కాల్ రావడంతో నేనూ గోపీ మాత్రమే వేడిగా టీ త్రాగి బయలుదేరబోయాం. చిన్నపిల్లవాడిలాగ కుక్క మాతో బయటకు రావడానికి మారాం చేసింది.

"మిమ్మల్ని హాయిగా మాట్లాడుకోనివ్వదు. స్కాట్‌ని తీసుకెళ్ళకండి. బయ్యా వస్తే వాడితో పంపిస్తాను" అని హేమలత సలహా ఇచ్చింది. స్కాట్ మొహంలోకి గోపీ చూస్తూ జాలితో కరిగి పోయాడు. "సరే వాణ్ని నాతో రానియ్యి. నేనివాళకి తీసుకునివెళ్తాను." అంటూ స్కాట్‌ని కూడా మా ఇద్దరి వెనకా వచ్చేలా చేశాడు. వీడికి పిల్లలు కలిగేలోగా కుక్క ఒకపసిపిల్లడిలా వెంటపడుతూ మారాం చేస్తూ వుంటుంది కాబోలు. అని నాలో నవ్వుకున్నాను.

రోడ్డు మీద మేమూ, మాకు కాసింత ముందుగానూ అప్పుడప్పుడు వెనక పడుతూనూ ముక్కూ మోడూ వాసన చూసుకుంటూ స్కాట్ నడుస్తూ వుంటే ఆకుక్కకున్న పలుకుబడి నాకు అర్థమైపోయింది. ఆ కాలనీలో ఆడుకుంటున్న పిల్లలందరికీ స్కాట్ ఒక హీరో. వాళ్లు పేరు పెట్టి పిలవగానే దాని కళ్ళలో ఆనందం ఇంతా అంతా కాదు. ఆ పిల్లల వేపు అది స్నేహంగా చూస్తేచాలు. ఆ పిల్లలంతా ఒకహీరో నుంచి ఆటోగ్రాఫ్ సంపాదించినంత మురిసిపోతున్నారు.

కాంటోన్మెంట్ పొలిమేరలు దాటి మరికాస్త దూరం వెళ్ళేసరికి రోడ్డుమీద అస్తవ్యస్తంగా వాహనాల రద్దీ ఎక్కువైపోతోంది. జనంకూడా ఎక్కువగా తిరుగుతున్నారు. గోపీ గంభీరంగా గొంతెత్తి 'స్కాట్' అన్నాడు. మా కన్నా కొన్నిఅడుగులు ముందున్న కుక్క గోపీ ముందుకు పరుగు పరుగున వచ్చి ఏం ఆజ్ఞ అన్నట్టు చూసింది. గోపీ వాడి ఎడమ చేత్తో ఎడమ తొడమీద చప్పుడయ్యేలాగ తట్టి 'హీల్' అన్నాడు. వెంటనే ఆ కుక్క చిన్న ప్రదక్షిణలాగ చేసి గోపీకి ఎడమవేపుగా వచ్చేసి కాలికి దగ్గరగా ఉంటూ వాడితోపాటు ఏ మాత్రం వెనకా ముందూ

కాకుండా నడవడం ప్రారంభించింది. వాడు వేగంతగ్గిస్తే కుక్క కూడా వేగం తగ్గిస్తూ, వేగం పెంచితే అది కూడా వేగం పెంచుతూ సమాంతరంగా నడుస్తోంది. వాడు ఏ కారణంగా నైనా నిలబడితే అదివాడి ప్రక్కనే కూర్చుండి పోతుంది కానీ ఒక్కఅడుగైనా ముందుకు వెయ్యదు.

నావేప్పు తిరిగిన గోపి " ఇక మనం వెనక్కి పోదాముదా అప్పా ! ఇక్కడ రోడ్లు రద్దీగా ఉంటాయి. " అంటూ వెనక్కు తిరిగి వచ్చిన దారినే సాగిపోతున్నాడు. సైనిక నివాసాల పరిసరాల్లోకి వచ్చేశాక " స్కాట్ గో" అని దానికి తిరిగి స్వేచ్ఛను ప్రసాదించేశాడు. ఈ క్రమశిక్షణకు వాళ్లు ఒక సాంకేతిక భాష ఏర్పరచుకున్నందుకు ఆశ్చర్యపోయాను. ఏవో ముచ్చటలు చెప్పుకుంటూ మేం నడుస్తూ వుంటే మాకు కాసింత వెనకా ముందూ అవుతూ హాయిగా స్కాట్ కూడా గాలి పీల్చుకుంటోంది.

సరిగ్గా ఇలాంటి సమయంలోనే జరిగిన ఒక చిన్న సంఘటన నన్ను ఒక విధమైన తాత్త్వీక చింతనలోకి లాక్కుపోయింది. కాసింత చీకటి ముసురుకొస్తూ వుంది. మా మాటల్లో మేమున్నాం. స్కాట్ మీద ప్రత్యేకంగా మా దృష్టిలేదు. రెండు బక్క చిక్కిన కుక్కలు ఎక్కడి నుంచో వచ్చి స్కాట్ని చూసి అరుస్తూ వెంబడించాయి. మొదట్లో దూరదూరంగా ఉండి అరుస్తున్నా క్రమంగా స్కాట్కి చాలా దగ్గరగా వచ్చి కర్కశంగా అరుస్తూ వెంటబడుతున్నాయి. స్కాట్ వాటిని తప్పించుకుని ముందుకు సాగిపోతోంది. అయినా అవి దానిని విడవడం లేదు. ఏదో ముచ్చటలు చెప్తున్న గోపి దృష్టి అటుపోక పోయినా నేను మాత్రం చూస్తూ " గోపీ ! ఇదేం అన్యాయం రా. సింహంలా ఉన్న నీ స్కాట్ దాన్నది రక్షించుకునే స్థితిలో లేదా ? అరవనైనా అరవదేం ?" అన్నాను.

గోపి చెప్పే ముచ్చట్లు ఆపి స్కాట్ కేమైందని చూశాడు. ఆ రెండు చిన్న కుక్కలు ఎలా విసిగిస్తున్నాయో చూడు అన్నాను. గంభీరంగా గొంతు పెంచి " స్కాట్ ఎటాక్" అన్నాడు. ఒక్క క్షణమైనా ఆలస్యం లేకుండా వెనక్కు తిరిగి ఉగ్రరూపంతో అర్భకంగా ఉన్న ఆ కుక్కల మీదికి ఉరికింది. అంతే బ్రతుకు మీద తీపితో ఆ రెండు శాల్తీలు పరుగు తీశాయి. ఇంకోక్షణం ఆలస్యం చేస్తే ఏం జరిగేదో ఏమోకానీ, ఇంతలో గోపి, " స్కాట్ నోగుడ్బాయ్ !" అన్నాడు. అంతే ఉన్నదున్నట్లుగా నిలిచిపోయి మంత్రించినట్టు వెనక్కు తిరిగి మమ్మల్ని కలుసుకుంది. బ్రతుకు జీవుడా అనుకుంటు ఆ రెండు కుక్కలూ అదృశ్యమైపోయాయి. తనకు దగ్గరగా వచ్చిన స్కాట్ని చేత్తో ఆప్యాయంగా తట్టి " గుడ్బాయ్ ! " అన్నాడు

మరోసారి. ఎర్రని కాగితపు ముక్కలా వ్రేలాడుతున్న నాలుకను ఆడిస్తూ, రొప్పుతూ, తోక ఊపింది. గోపి ఇచ్చిన ప్రశంసకు పరమానందాన్ని అనుభవిస్తూ.

మేం గోల్ఫ్ వ్యూ క్వార్టర్స్ వేపుకు తిరిగి గోపి ఇంటికి చేరుకున్నాం. నా బసకు వెళ్ళిపోవాలని ఆత్రంగా చేతి గడియారం వేపు చూశాను.

"ఇప్పుడెక్కడికి వెళ్తావు? రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకో. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ చేసి వెళ్ళి నీ పనులు చక్కబెట్టుకోవచ్చు" అని గోపి, వాడి భార్య అడ్డువచ్చారు. ఆ రాత్రి బాల్కనీలో దోమతెర కట్టిన మంచాల మీద కూర్చుని నేనూ గోపి ఎన్నెన్నో మిగిలిపోయిన ముచ్చటలు చెప్పుకుని ఆలస్యంగా పడుకున్నాం.

గోపి పడుకున్నా నాకు మాత్రం కొంతసేపటి వరకూ నిద్రపట్టలేదు. దాని నైజగుణాన్నే స్కాట్ నియంత్రించుకోగలగడం నన్ను ఆలోచనల్లో ముంచి వేసింది. ఈ శతాబ్దిలో జరుగుతున్న నరమేధ,పెరుగుతున్న హింసా ప్రవృత్తి మీద ఆశ్రమంలో వృద్ధులు జరుపుకున్న చర్చ– ఆ నీరవనిశీధిలో నాకు గుర్తొచ్చింది. పిల్లి ఎలుక మీదకు దూకకపోతే దాన్ని అహింసావ్రతం అనవచ్చు కానీ ఎలుక పిల్లి మీద పడకుంటే ఎన్నటికీ అది అహింసా వ్రతం కాబోదని ఎప్పుడో చదివిన వాక్యం జ్ఞాపకానికి వచ్చింది.

అయితే, స్కాట్ ప్రవర్తనావళి అంతా గోపి పట్ల తనకున్న భయం వలనా లేక ప్రేమవలనా? అన్న సందేహం ఒక భేతాళ ప్రశ్నగా మిగిలి – బరువుగా అ ప్రశ్నతోనే నిద్రలోకి జారుకున్నాను. చల్లని గాలికి నిద్రపట్టేసి ఉదయాన్నే లేవలేకపోయినందుకు సంకోచంతో మంచమ్మీంచి లేచి దోమతెర తొలగించి చూశాను.

లేలేత సూర్యకాంతిలో అప్పటికే లేచిపోయిన గోపి బాల్కనీ ఒడ్డున కూర్చుని ఒక చేత్తో వార్తాపత్రికను తిరగేస్తూ చేత్తో స్కాట్ వీపుని నిమురుతున్నాడు. ఆ కుక్క రెండు కళ్ళూ మూసుకుని గోపి మోకాలు కానుకుని పడుకుంది. అలౌకికానందాన్ని అనుభవిస్తున్న చిన్మయానంద యోగిలా ఆ క్షణం నాకు కనిపించింది. నా ప్రశ్నకు జవాబు దొరికింది.

–జాగృతి, నవంబర్ 30 డిసెంబర్ 6, 1998